## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-03-2003, ఆత్రేయపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఆందోళనగా ఉన్నవారు, ఆవేదనగా ఉన్నవారు, అశాంతిలో ఉన్నవారు మంచి పనులు చేయలేరు. శాంతిగా, నిర్మలంగా, నిశ్చలంగా ఉన్నవారు మాత్రమే మంచిపనులు చేయగలరు. మంచి మంచికోసమే చేయటం నేర్చుకోవాలి. సజ్జనసాంగత్యం విడిచిపెట్టవద్దు. హృదయంలోఉన్న సత్యవస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి సత్పురుషులు సహకరిస్తారు. మనకు ధనం ఉందని భోగం పెంచుకోకూడదు ధనం ఇక్కడ ఆగిపోతుంది, భోగప్రవృత్తి వచ్చే జన్మకువస్తుంది. ప్రతీసంసారంలో అవసరంలేని ఖర్చులు పెంచుకొంటున్నారు, దానివలన చాలాప్రమాదం, జ్ఞానానికి దూరమవుతారు, భక్తికి దూరమవుతారు. మీకు ధనం ఉంటే మంచిపనులుచేయండి, పుణ్యం వస్తుంది. అంతేగాని మంచిపనులు చేస్తూ మనస్సును పెంచుకోవద్దు అని చెపుతున్నారు. మనస్సును పెంచుకోవటంవలన జ్ఞానానికి దూరమవుతారు. నీవు చేసే మంచిపనుల వలన మనస్సు పల్చబడితే అదిలోకానికి మంచిదే, దానివలన నీకు జ్ఞానం కలుగుతుంది. మనదైనందిన జీవితంలో ఎలా జీవిస్తే భగవదనుభవం కలుగుతుందో అలా జీవించటం నేర్చుకోవాలి, అదే జ్ఞానయజ్ఞం. భగవంతుడు మనహృదయంలో ఉన్నాడు. ఆయనలోపల ఉన్నాడు కాబట్టే మనం ఉన్నాము. ఆయన హృదయాన్ని కాళీచేస్తే ఈతుక్కును తీసుకొనివెళ్ళి స్మశానంలో పడవేస్తారు, ఈవిషయం కూడా మనకు తెలియటంలేదు. పూర్వజన్మలో మీరు చేసిన కర్మను బట్టి మీకు ఎప్పుడైనా దుఃఖంవస్తూఉంటుంది, సంతోషం వస్తూఉంటుంది. వీటిని పట్టించుకోవద్దు. వీటిని ఎక్కువగా పట్టించుకొంటే మనబుద్ధి మోహం అనే బురదలోనుండి బయటకు రాదు, వైరాగ్యంకలుగదు. వైరాగ్యం లేకపోతే జ్ఞానం కలుగదు అని భగవంతుడు చెపుతున్నాడు. మనకు జ్ఞానం కలుగకపోవటానికి మనస్వార్థంకారణం. మీరు రోజుకు 4గంటలు ధ్యానం చేస్తారు అనుకోండి, స్వార్థం కొంచంకూడా తగ్గలేదు అనుకోండి, ఇలా మీరు కోటిజన్మలు ఎత్తినా మీకు మోక్షంరాదు. త్యాగికానివాడు జ్ఞానికాలేడు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే భయంతగ్గించుకోవాలి. మనం భగవంతుడిని ఉపాసనచేయాలి, ఆయన రూపాన్ని ధ్యానంచేయాలి. ఉపాసన చేయగాచేయగా ఆయన మనకు గోచరిస్తాడు. మనం జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ, భవిష్యత్ గురించి గాలిమేడలు కట్టుకొంటూ ఇలా కాలక్షేపంచేస్తూఉంటే ఎప్పడో మరణంవస్తుంది, ఈజీవితం అంతా వృధాఅవుతుంది. పనిదగ్గర అశ్రద్దగా ఉండవద్దు, మీపనిమీరు శ్రద్దగా చేసుకొంటూ మిగతాటైములో భగవంతుడిని ధ్యానించగా, ధ్యానించగా, ఆయనకు ఇష్టమైన పనులు మనంచేస్తూ ఉంటే ఆయనచేతిలో ఉన్న జ్ఞానాన్ని మనకు ప్రసాదిస్తాడు. ఈశ్వరుడి యందు ప్రేమ, భక్తికలిగి ఉండాలి. భక్తివలన చిత్తశుద్దికలుగుతుంది, ఏకాగ్రతకలుగుతుంది, ఇహపరాలను కూడా సాధించగలము. మీరు చేసే పనిశ్రద్ధగా చేస్తే, భగవంతుడు ఉన్నాడు అని పూర్తి విశ్వాసంతో చేస్తూఉంటే హృదయంలో ఉన్నఆనందం మీకు తెలుస్తుంది. సత్పురుషులతో సాంగత్యంచేయండి, దుస్సాంగత్యం చేయవద్దు అని ఆచార్యులవారు చెప్పారు. సత్పురుషుల సాంగత్యం ద్వితీయం ఎక్కడైతే లేదో అక్కడకు నిన్ను తీసుకొని పోతుంది అని చెప్పారు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో. నీ అహంకారం రోజుకు పదిరకాలుగా మారుతూ ఉంటుంది. నీఅహంకారం చెప్పినట్లు నీవు వినటంకాదు, పరమేశ్వరుడు చెప్పినట్లుగా వింటే ఆయన స్వరూపాన్ని పొందుతావు.

మనకు పునర్జన్మ రావటానికి అహంకార, మమకారములేకారణం. మమకారం పోతే మనకు చిత్తశుద్ధి కలుగుతుంది, అహంకారంపోతే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది అని చెప్పారు. ఈరెండు కారాలలో నుండి విడుదల పొందటానికే మనం చేసే సాధనలు అన్నీ పెద్దలు చెప్పిన మాటలు వింటున్నాము, శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నాము నాకు దుఃఖం పోవటంలేదు, బాధపోవటంలేదు అని భగవాన్‌ను అడుగుతున్నారు. ఆత్మానుభవం కలిగే వరకూ ఏదోకొరత, ఏదోవెలితి, ఏదోఅశాంతి ప్రతీజీవుడిని వెంటాడుతూ ఉంటుంది. ధర్మాన్ని ఆచరిస్తూ, ధర్మాన్ని ఆధారంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే నీకు మోక్షంకలుగుతుంది కాని ధర్మాన్ని విడిచిపెట్టి నీ తెలివితేటల వలన మోక్షాన్ని పొందలేవు. మీరు భక్తిని సంపాదించుకొంటే, మీరుశాంతిస్థానంలో ఉంటే బాహ్యకారణాలవలన దుఃఖంవచ్చినా అవిఏమీ మిమ్మల్ని అంటుకోవు, మీరు శాంతిగా, ఆనందంగా ఉండగలరు. గాఢనిద్రలో నీకు దేహానికి సంబంధించిన, లోకానికి సంబంధించిన, మనస్సుకు సంబంధించిన చింతలేదు. అదే అసలుస్థితి. ఆస్థితినివదిలేసి జాగ్రదవస్థలోనికి రాగానే నేను అనే తలంపువచ్చింది, ఆతలంపును పట్టుకొని ఊరేగుతున్నావు. అసలును వదిలేసి అబద్దాన్ని పట్టుకొని తిరుగుతున్నావు, ఎన్నిజన్మలు ఇలా తిరుగుతావు. నాకు దుఃఖం ఎప్పటివరకు ఉంటుంది అని అడిగితే దానికి భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే తానొకవ్యక్తిని అనే భావన పోయేవరకు ఇది తప్పదు. నువ్వుదేహంతోటి, మనస్సుతోటి తాదాప్యం పొందినంతకాలం

నువ్వు ఒకదేశానికి అధిపతి అయినా నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. లోకంలో మంచివారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు. ఆగొడవవద్దు. మీరు ఎందుకు వచ్చారో ఆపనిచూసుకోండి. జ్ఞానాన్ని సముపార్జించు కోవటానికి భగవంతుడు ఈదేహాన్ని ఇచ్చాడు. వచ్చినపని మర్చిపోతే నువ్వేనష్టపోతావు. సుఖదుఃఖాలు, లాభనష్టాలు అన్నీ నీప్రారబ్ధాన్ని బట్టివస్తాయి. నీకు లాభంవచ్చినా, నష్టంవచ్చినా అవి నీతెలివితేటలను బట్టిరావు, ప్రారబ్ధాన్ని బట్టివస్తాయి. నీకుధనం వచ్చినా, సంతోషంవచ్చినా, దారిద్ర్యంవచ్చినా, దుఃఖంవచ్చినా అవిఏమీ నీవుకాదు, అవి నీప్రారబ్ధాన్ని బట్టివస్తాయి. ఇదిమీకు బాగా అర్థమవ్వాలి, ఇది అర్థమయితే ఎప్పడూ మీరు ఆనందంగా ఉండవచ్చు. మీకు దారిద్ర్యం వచ్చింది అంటే దానిద్వారా నేర్చుకొనే పాఠాలు ఉన్నాయి, అందుచేత దారిద్ర్యంలో పెడుతున్నాడు. ఒకోసారి ధనవంతుడు పేదవాడు అవ్వవచ్చు, పేదవాడు ధనవంతుడు అవ్వవచ్చు. ఇదిఅంతా చూసేవారికి ఆశ్చర్యం అనిపించవచ్చు కాని భగవంతుడికి ఆశ్చర్యంగా ఉండదు ఎందుచేతనంటే ఇది అంతా వాడుచేసిన కర్మను బట్టి జరుగుతుంది. జీవుడు కర్మకు స్వాధీనం అయిఉంటాడు. నీకు ఏరకమైన దుఃఖంవచ్చినా అది నీవు పూర్వజన్మలో చేసిన దానినిబట్టి వస్తోంది. భగవంతుడు కర్మఫలదాత. నువ్వు చేసిన దానికి ఫలితం ఇస్తాడు, ఆవిషయంలో మటుకు అజాగ్రత్తగా ఉండడు. చేసినవాడు ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్నాడ, చేసినది అహంభావనే, అదే అనుభవిస్తోంది. చేసినది మీరు కాదు, అనుభవిస్తున్నది మీరుకాదు వాటిని ఒక ప్రక్కనపెట్టండి, మీరులోపలకు వెళ్ళిపోండి అంటున్నారు భగవాన్, పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయినవాడు తిరిగి పుడతాడు. వీటిగొడవనీకు వద్దు. వీటితో తాదాప్యం వలన నీకు ఏదోఅయిపోతోంది అనుకొంటున్నావు. ఈశరీరం పుట్టుక ముందు నీవు ఉన్నావు, శరీరంవచ్చాక నవ్వు ఉన్నావు, శరీరం పోయాక కూడా నీవు ఉంటావు ఎందుచేతనంటే అదినీవుకాదు, ఇదితెల్సుకోవటానికి నీకు శరీరంవచ్చింది. ఈశరీరాన్ని, కాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొని అది తెలుసుకో. అది తెలుసుకోకుండా నీవు ఎన్ని సాధించినా ఒకటిలేని సున్నలతోసమానము.

మీరు కర్మను చేయండి, కర్మనుయోగంగా చేయండి. కర్మయోగంవలన మీకు మోక్షంరావాలి అంతేగాని మీరు చేసే పనుల వలన పేరువచ్చింది అనుకోండి, ఆపేరును ఏమిచేసుకొంటారు. ఈలోకంఎంతనిజమో, ఈదేహం ఎంతనిజమో ఆపేరుకూడా అంతేనిజం. ఈసృష్టిఅంతా పరమేశ్వరుడిదే. ఏరూపంలో చూసినా, ఏనామంలో చూసినా అందరిలోను ఆయననే చూస్తూ, ఆయననే ఆరాధిస్తూ, నీవు ఏపనిచేస్తున్నా ఆయనను పూజిస్తున్నాను అనే భావనతో చేస్తే నీకు మోక్షం కలుగుతుంది. అంతేగాని నీవు చేసేకర్మనిన్ను బంధించకూడదు. నువ్వు చేసేపని నిన్ను అజ్ఞానంలోనుండి విడుదలచేయాలి అంతేగాని ఆపనివలన అజ్ఞానంలో కూరుకొనిపోకూడదు, దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవించటం వలన నీకుకోరికలు, తలంపులు వస్తున్నాయి. మీకు ఏతలంపు వచ్చినా దానికి దేహము నేను అనే తలంపు కారణం అవుతుంది, మీరు ప్రశాంతంగా కూర్చొని ఆలోచించుకొంటే అది మీకు తెలుస్తుంది. దేహమునేను అనేబుద్ధిని ఛేధించటమే సాధనయొక్క ప్రయోజనం. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటేనీకు ఏదైనా బాధవచ్చింది అనుకో, అదినిజం అనుకోవద్దు, అదికూడా ఒకతలంపు మాత్రమే. ఆబాధ నిజమయితే నీ గాఢనిద్రలో ఆబాధ ఎక్కడికి వెళ్ళిపోతోంది. తలంపువచ్చినప్పడు బాధవస్తోంది, తలంపులేనప్పడు బాధలేదు గాఢనిద్రలో నీవు శరీరరహితుడవు, మనస్సురహితుడవు, లోకరహితుడవు. ఆస్థితిని నీవుజాగ్రదవస్థలో తెచ్చుకోవాలి. అప్పడునీకు బాధలేదు, దుఃఖంలేదు, పునర్జన్మలేదు. మీకు మంచి మంచి ఆలోచనలు, తలంపులు వస్తున్నాయి అనుకోండి, అవికూడా సంపదతోసమానము. జ్ఞానసూర్యుడు మీహృదయంలోనే ఉన్నాడు. మీరు ఎన్నియాత్రలు చేసినా, ఎన్నినదులలో స్నానాలు చేసినా, ఎంతమంది దేవతలను దర్శించినా చివరకు హృదయం దగ్గరకు రావలసిందే, నిర్వాణసుఖం పొందాలంటే చివరకు హృదయం దగ్గరకు రావలసిందే, ఇక్కడఉన్న చైతన్యాన్ని దర్శించాక మొత్తం లోకం అంతా కూడాచైతన్యం గానే కనబడుతుంది. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూస్తే లోకంనిన్ను బంధించదు. పరమేశ్వరుడు అన్ని కాలాలలో ఉన్నాడు, అంతటావ్యాపించి ఉన్నాడు, కాని మనం పరిమితులు పెట్టుకొంటున్నాము. అందువలన మనకు దుఃఖంవస్తోంది. భేదబుద్ధివలన, రాంగ్‌తింకింగ్ వలన మనకు దుఃఖం వస్తోంది. మీరు చేస్తున్నపని శ్రద్ధగా, ఇష్టంగా, ప్రేమగాచేస్తే కర్మకు అతీతమైన స్థితికి తీసుకొనివెళతాడు. చేసేపని అశ్రద్ధగా, అయిష్టంగా చేస్తారు అనుకోండి రాబోయే జన్మలో మరల ఆపనే అప్పగించి మొట్టికాయలు మొట్టి మీచేత చేయిస్తాడు. సత్పురుషుల సహవాసం వలన మీరు కాలాన్ని జయిస్తారు, కోరికను జయిస్తారు. ఈకోరికలను, కాలాన్ని దాటివెళ్ళిపోతారు అది సత్పురుషులయొక్క వైభవం అని ఆచార్యులవారు చెప్పారు. మాకు మోక్షంరాదు అని అనుకోవద్దు, ఆతలంపు మీకు అడ్డుపడుతుంది. ఆత్మవిశ్వాసాన్ని ఎప్పడూ పోగొట్టుకోవద్దు. ఆత్మవిశ్వాసంవలన మీరు

బాగుపడతారు. సముద్రంలో ఎంతనీరు ఉందో నీహృదయంలో అంత ఆనందం ఉంది అదినీకు అందకపోవటానికి ఒక్కటే అడ్డు. నీవుకాని దేహాన్ని, నీవుకాని మనస్సును నీవు అనుకోవటం వలన లోపలఉన్న ఆనందం నీకు అందటంలేదు. దానిని చేధించటమే జ్ఞానం. దేహమే నేను అనే తలంపువలన, మూలతలంపువలన నీకు హృదయంలో ఉన్న ఆనందం అందటంలేదు. నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా, ఏరకంగా సాధన చేసినా ఈమూలతంపును చేధించటమే నీసాధన యొక్కగమ్యం. మీరు ఏరూపాన్ని చూసినా అన్ని వస్తువులలో, అన్ని పేర్లలో భగవంతుడినే చూడటం నేర్చుకోండి. ఇలా చూడటం నేర్చుకొంటే హెచ్చుతగ్గులు, రాగద్వేషాలు పోతాయి. మనం చేసినదే మనకు ఎదురువస్తుంది. గాని మనం చేయనది మనకు ఎదురురాదు. ఎవరిప్రారబ్దంలోఏది ఉంటే అదే వస్తుంది. ఆగొడవలు వదలిపెట్టి మీరు బాగుపడటానికి ప్రయత్నం చేసుకోండి. అక్కడ నుయ్యి తవ్వించాను అంటే మంచిదే చేయండికాని మీరు సాధనచేసి మీరు శాంతిగా, పవిత్రంగా, ఆనందంగా ఉండగలిగితే మీద్వారా ఇతరులకు సహాయం అందుతుంది, వారు బాగుపడతారు, దేశం బాగుపడుతుంది. భక్తికి ఉన్నశక్తిదేనికిలేదు, భక్తిలోనుండే శక్తివస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-03-2003, యానాం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

జ్ఞానసముపార్జనకు భగవంతుడు మనకు కొన్ని అవకాశములు ఇస్తున్నాడు. కాని మనం వాటిని సద్వినియోగం చేసుకోవటంలేదు, దుర్వినియోగం చేస్తున్నాము. మన జీవితయాత్ర నడవటంకోసం ఎవరివృత్తివారు చేసుకొంటూ ఆత్మజ్ఞానసముపార్జన చేసుకోమని భగవంతుడు చెపుతున్నాడు. పని కూడా దేవుడితో సమానము. భగవంతుడు మీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేసుకొంటూ, పనిలో దేవుడిని చూడటం నేర్చుకొంటే మనకు దైవానుగ్రహం కలుగుతుంది. మనం ఏదైనా ఒక సబ్జెక్టు విన్నప్పుడు దానిని లోతుగా విశ్లేషణ చేయాలి, దానిని సొంతం చేసుకోకపోతే అది మీకు ఉపయోగపడదు. మనం గాఢనిద్రలో శరీరంలేకుండా, మనస్సులేకుండా ఉన్నాము, అక్కడ సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము. ఇది మీఅనుభవానికి సరిపోతోందో, లేదో చూసుకోండి. జాగ్రదవస్థ వచ్చేటప్పటికి మొదట నేను అనే తలంపు వస్తోంది. మనం దానితో కలిసిపోతున్నాము. ఇదే మొదటి తప్పు. ఆమొదటిపొరపాటులో నుండి చాలా పొరపాట్లు చేస్తున్నాము. బంతి జారాలిగాని ఎక్కడకు వెళ్లిపోతుందో చెప్పలేము అలాగే మనిషి పతనం అవ్వటం ప్రారంభిస్తే ఎంతవరకు వెళతాడో చెప్పలేము. మనందరం చేసే పొరపాటు ఏమిటి అంటే మన అస్తిత్వాన్ని శరీరానికి, మనస్సుకు కుదించేసుకొంటున్నాము. నేను అంటే శరీరం అనుకొంటున్నాము. దేహము నేను అనేతలంపు వచ్చేటప్పటికి మనకు దుఃఖం వస్తుంది. ఇది మన అనుభవంలో తెలుస్తోంది. మనంకానిదానిని మనం అనుకోవటం వలననే డిజైర్ ప్రారంభమవుతోంది, ఎటాచ్‌మెంట్ ప్రారంభమవుతోంది, వీటివలన మనకు దుఃఖంవస్తోంది. మీరు సాధన చేయాలంటే దేహాన్ని, మనస్సును ఆరోగ్యంగా చూసుకోవాలి. మనకు వచ్చేతలంపులను తగ్గించుకోవాలి, మాటలు తగ్గించుకోవాలి, అతిగా తినకూడదు, అతిగా నిద్రపోకూడదు. అతినిద్రవలనభౌతికఅభివృద్ధి, ఆధ్యాత్మికఅభివృద్ధి ఆగిపోతుంది. అవసరమైనప్పుడు మాట్లాడాలి, అహంభావన కోసం మాట్లాడకూడదు. మనకు తెలియనది తెలియదు అని చెప్పాలి కాని తెలిసినట్లు నటించకూడదు. మీరు ఏగుడిలోనికి వెళ్లినా మోక్షం తప్పించి ఏమీఅడగవద్దు. మీరు మోక్షం అడిగితే మోక్షం ఇచ్చి మిగతా విషయాలు కూడా ఇస్తాడు. అడగకపోతే ఇవ్వడేమో అనుకొని మనం తొందరపడి అడుగుతాము. మనం లోకానికి సంబంధించిన విషయాలు అడుగుతాము. తాత్కాలిక ప్రయోజనాలకు, ఆకర్షణలకు లోబడిపోతున్నాము. అసలు మనకు ఏదిమంచిదో మనకు తెలియటంలేదు. మీరు ఇక్కడకు వచ్చినా, నేను ఇక్కడకు వచ్చినా మన తెలివితేటలవలన రాలేదు, భగవంతుడి సంకల్పాన్ని బట్టి మనం ఇక్కడకు వచ్చాము. ఒకోవిషయాన్ని మనం జ్ఞాపకంపెట్టుకొందామనుకొన్నా మర్చిపోతాము ఒకోవిషయం మరుపువస్తే బాగుండును అని మనం అనుకొంటే అదే మరల మరల జ్ఞాపకం వస్తుంది. నీకర్మానుసారాన్ని బట్టి ఆమరుపును, జ్ఞాపకాన్ని తీసుకొనివచ్చే వాడిని నేనే అని భగవంతుడు చెపుతున్నాడు. God is everything, I am nothing ఈసూత్రం మీరు గుర్తుంచుకొంటే ఈక్షణంలో మీదుఃఖం చల్లారిపోతుంది. మనం ఉద్రేకాన్ని పెంచుకోవటంకాదు., ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. ఉద్రేకం వలన ఇంతవరకు ఎవరూ బాగుపడలేదు, మనమీద మనం విశ్వాసం పెంచుకోవాలి. కొంతమందికి ఏమీ కారణం లేకుండా విసుగుదలవస్తుంది. ఆవిసుగుదలఉన్న మనుషులకు జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది, గ్రహించేశక్తి తగ్గిపోతుంది, తోటిమానవులతో ఇష్టంగా, ప్రేమగా జీవించే అలవాటు తగ్గిపోతుంది. కుటుంబసభ్యులపట్ల మీడ్యూటీ మీరు చెయ్యండి అంతేగాని వారిమీద మోహంపెట్టుకోవద్దు. మీ దేహానికి ఎలా ప్రారబ్దం ఉందో, మీ ఇంటిలోని వారి